# గుట్టలో వైభవంగా సుదర్శన నారసింహ హోమం



లక్ష్మీనరసింహుల తిరు కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు



ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

యాదగిరిగుట్ట, డిసెంబర్ 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సుదర్శన నారసింహ హోమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి గజవాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవను నిర్వహించారు. నిత్య తిరుకల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టారు. అనంతరం భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం వెండి మొక్కు జోడు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆండాళ్ అమ్మవారిని దివ్య మనోహరంగా అలంకరించి శ్రీ రంగనాథుడిని పరిణయమాండేందుకు గోదాదేవి చేపట్టిన తిరుప్పావై, పొంగళి నివేదన, పాశుర పఠనం నిర్వహించారు. పాతగుట్ట(పూర్వగిరి) ఆలయంలో విశ్వశాంతి నిమిత్తమైన, లోకకల్యాణార్థం చేపట్టిన పాంచాహ్నిక, ఏకకుండాత్మక సుదర్శన నారసింహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనుబంధ రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి రుద్రాభిషేకం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.36,38,327 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి తెలిపారు.

**కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు..**

## 23న ముక్కోటి ఏకాదశి

### గుట్టలో ఉత్తర ద్వార దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

ముక్కోటి(వైకుంఠ) ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 23వ తేదీన యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహ స్వామి దివ్య క్షేత్రంలో ఏర్పాట్లపై ఆలయ అధికారులు దృష్టి సారించారు. స్వామి వారు ఉత్తర ద్వారం గుండా భక్తులకు దర్శనమివ్వనున్న నేపథ్యంలో ఉత్తర రాజగోపురం ముందు గల మాఢవీధుల్లో చుట్టూ తాత్కాలిక గ్రిల్స్ బిగించనున్నారు. ఈ మేరకు సోమవారం ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ ఈఈ దయాకర్‌రెడ్డి, ఏఈఓ గట్టు శ్రవణ్‌కుమార్ ఏర్పాట్లను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఉత్తర ద్వారం గుండా స్వామిని దర్శించుకునేందుకు వీవీఐపీ, వీఐపీతో సాధారణ భక్తుల తాకిడి పెరుగనున్న నేపథ్యంలో వారికి ప్రత్యేకమైన క్యూలైన్‌లో అనుమతి ఇవ్వనున్నారు. ముక్కోటి ఏకాదశి పూర్తైన అనంతరం గ్రిల్స్‌ను తొలగించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. నూతనంగా నిర్మించిన ఆలయంలో రెండోసారి స్వామి వారు ఉత్తర ద్వారం గుండా దర్శనమివ్వనున్న సందర్భంగా దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం వాటిల్లకుండా స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దంపతులకు స్వామి ఆశీర్వచనం అందిస్తున్న అర్చకుడు

# పాలెం లక్ష్మీనరసింహుడికి ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ముడుపు

నకిరేకల్, డిసెంబర్ 18 : మండలంలోని పాలెం గ్రామంలో గల లక్ష్మీనర్సింహ స్వామి ఆలయాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సతీసమేతంగా సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నామినేషన్‌కు ముందు లక్ష్మీ నర్సింహ స్వామికి ముడుపు కట్టిన వారు తమ కోరిక నెరవేరడంతో ఆలయాన్ని సందర్శించి చెల్లించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి స్వామి ఆశీర్వచనాలు అందించడంతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ లక్ష్మీనర్సింహ స్వామి ఆశీర్వాదంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరారు. రాబోయే రోజుల్లో పాలెం లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేశ్ గౌడ్, పాలెం సర్పంచ్ ఏకుల కవితావిజయ్, నాయకులు రాచకొండ శ్రవణ్ పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో బీఈడీ కళాశాలల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గోపాల్‌రెడ్డి,
ఎడ్యుకేషన్ డీన్ మృణాళిని, ఎన్‌సీటీఈ సభ్యుడు శంకర్

- **ఎంజీయూ వీసీ సీహెచ్.గోపాల్‌రెడ్డి**
- **మారుతున్న కాలానుగుణంగా సిలబస్‌లో మార్పులు**
- **ఎడ్యుకేషన్ డీన్ మృణాళిని, ఎన్‌సీటీఈ సభ్యుడు శంకర్**

రామగిరి, డిసెంబర్ 18 : సమాజానికి ఉపాధ్యాయులను తయారు చేసి అందించే బీఈడీ కళాశాలల పాత్ర విద్యా వ్యవస్థలో కీలకమైందని ఎంజీయూ వీసీ సీహెచ్.గోపాల్‌రెడ్డి అన్నారు. ఎంజీయూ అనుబంధంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న బీఈడీ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో బీఈడీ నూతన సిలబస్, ఇతర అంశాలపై సోమవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులంటేనే ప్రతిరోజూ నూతన విద్యార్థులేనని దానికి అనుగుణంగా బీఈడీ సిలబస్ మార్పులు చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఉస్మానియాతో పాటు తెలంగాణలోని అన్ని యూనివర్సిటీలకు ధీటుగా ఎంజీయూలో సైతం మార్పులు చేశామన్నారు. మారిన సిలబస్‌పై అందరితో చర్చించి లోటుపాట్లు తెలుసుకున్నారు. మారుతున్న కాలానుగుణంగా నూతన బోధన సామర్థ్యాలు అందించేందుకేనని వెల్లడించారు. ఎంజీయూ ఎడ్యూకేషన్ డీన్ మృణాళిని, ఎన్‌సీటీఈ సభ్యుడు పి.శంకర్ మాట్లాడుతూ మారిన బీఈడీ సిలబస్, ప్రాక్టికల్ పేపర్లు, వాటి నిర్వహణ తదితర అంశాలపై వివరించారు. మారిన సిలబస్‌పై ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు పెడాగాజీ, జనరల్ పేపర్స్ వారీగా త్వలోనే అవగాహన కల్పిస్తామన్నారు. ప్రిన్సిపాల్స్ అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు వెల్లడించారు. అందరూ సిలబస్‌కు ఆమోదం తెలపడంతో హర్షం వ్యక్తం చేశారు. ఎంజీయూ అనుబంధ బీఈడీ కళాశాలల యాజమన్యాల కన్వీనర్ జాబ్బర్, పలు కళాశాల ప్రిన్సిపాళ్లు తెలిపిన అంశాలకు వివరణ ఇవ్వడంతో సంతృప్తి చెందారు. ఎంజీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ బీఈడీ పూర్తి చేసిన విద్యార్థులకు వర్సిటీ నుంచి అందిస్తున్న జామ్‌మేళాలు, ఇతర అంశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంజీయూ డైరెక్టర్ ఆఫ్ ఆడిట్ సెల్ కొప్పుల అంజిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఓఎస్‌డీ అల్వాల రవి, అసిస్టెంట్ ఆడిట్ సెల్ డైరెక్టర్ రామచంద్రం, కోఆర్డినేటర్ అమరేందర్, సీనియర్ అసిస్టెంట్ సరిత, ఎంఈడీ, వివిధ బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు బొడ్డుపల్లి రామకృష్ణ, అబ్దుల్ మునాఫ్, ప్రవీణ్, దేవరాజు, రఫీ, సిద్ధిఖీ, ఆదిత్య, జాఫర్ పాల్గొన్నారు.

### విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంజీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లాలో గల యూజీ, పీజీ, ఎంబీఏతో పాటు వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడారు. యూనివర్సిటీ మారుతున్న కాలానుగుణంగా అందిస్తున్న విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రాష్ట్రపతి పర్యటనకు భారీ బందోబస్తు

- **ఏర్పాటు చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు**
- **హెలిప్యాడ్, పలు స్థలాలను పరిశీలించిన కలెక్టర్, పలు శాఖల అధికారులు**



వినోబా మందిరంలో ఏర్పాట్లు పరిశీలించి సూచనలు చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 18 : రాష్ట్రపతి ద్రౌపది ముర్మూ పర్యటనకు పకడ్బందీగా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన కలెక్టర్ హనుమంతుకే జెండగేతో కలిసి రాష్ట్రపతి సభా వేదిక ఏర్పాట్లు, పోలీస్ స్టేషన్ సమీపంలోని హెలిప్యాడ్, ట్రయల్ రన్‌ను పరిశీలించారు. అనంతరం వినోబా మందిరం, టూరిజం సెంటర్‌లో భూదాన స్తూపం, ఆచార్య వినోబాబావే, ప్రథమ భూదాత వెదిరే రామచంద్రారెడ్డి కాంస్య విగ్రహాలు, భూదానోద్యమం సంబంధించిన చిత్రాలు, రంజన్ సిల్క్ యూనిట్లలో ఇక్కత్ పట్టు చీరల తయారీ ప్రక్రియ, చేనేత యూనిట్లు, స్టాళ్లు ఏర్పాటుకు వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పర్యటన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్రపతి సభా వేదిక వద్దకు అనుమతి ఉన్న వారినే అనుమతించాలని, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడీషనల్ కలెక్టర్ భాస్కరరావు, వీవర్స్ సర్వీస్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్‌కుమార్, రాష్ట్ర చేనేత జౌళి శాఖ అడీషనల్ డైరెక్టర్ ఎం.వెంకటేశం, రాచకొండ అడీషనల్ సీపీ తరుణ్ జోషి, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, జిల్లా చేనేత జౌళిశాఖ ఏడీ విద్యాసాగర్, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీపీఓ సునంద, డీసీహెచ్‌ఓ అన్నపూర్ణ, ఆర్డీఓ జగన్నాథరావు, తాసీల్దార్ వీరా భాయ్, మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, ఎంఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ ఎస్సై విక్రంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సోమవారం సాయంత్రం హెలీకాప్టర్ ట్రయల్ రన్ చేసింది. రాష్ట్రపతి రాక సందర్భంగా బాలాజీ ఫంక్షన్ హాల్ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.




భూదాన్ పోచంపల్లిలో హెలికాప్టర్ ట్రయల్ రన్